


పెన్నమ్మ తీరాన కన్నీటిధారలు

పుష్పగిరి వద్ద పెన్నా నదిలో మునిగి ఏనుగు బసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి (38) అనే ఇంజినీర్ బుధవారం మృతి చెందాడు. -8లో..



మిత్రున్ని ఫ్లైట్ ఎక్కించడానికి వెళుతూ..

కువైట్‌కు వెళ్తున్న మిత్రున్ని చెన్నై విమానాశ్రయం వద్ద వదిలేందుకు కారులో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 897 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	382	437
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 752.50 కిలోలు

న్యూస్‌రీల్

ఇద్దరు వీఆర్‌ఓలు సస్పెన్షన్



వీ రాఘవేంద్ర (ఫైల్)



ఎస్ ఆరీఫ్ (ఫైల్)

రాజంపేట రూరల్: రాజంపేట రెవిన్యూ పరిధిలో పనిచేసిన ఇద్దరు వీఆర్‌ఓలను కలెక్టర్ గిరీషా పీఎస్ సస్పెండ్ చేసినట్లు తహశీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి బుధవారం తెలియజేశారు. 2016వ సంవత్సరంలో బ్రాహ్మణపల్లి వీఆర్‌ఓగా విధులు నిర్వర్తించే సమయంలో అనర్హులకు ఆన్‌లైన్ చేసినందుకు వీ రాఘవేంద్రను సస్పెండ్ చేసినట్లు తెలియజేశారు. అదే విధంగా ఎంజీపురం వీఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న షేక్ ఆరీఫ్ తన పరిధిలో విధులు ఎక్కువగా ఉన్న సమయంలో అధికారులకు తెలపకుండా లీవ్ పెట్టి వెళ్లినందుకు సస్పెండ్ చేసినట్లు తెలియజేశారు.

డీఈఓ వెబ్‌సైట్‌లో పీజీటీ సీనియారిటీ జాబితా

వైవీయూ: ఉమ్మడి కడప జిల్లాలో హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పీజీటీలుగా పనిచేసేందుకు సమ్మతి పత్రం ఇచ్చిన స్కూల్ అసిస్టెంట్‌ల (పీజీ అర్హత కలిగిన) తాత్కాలిక సీనియారిటీ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ వై. రాఘవరెడ్డి తెలిపారు. జాబితా డబ్లుడబ్లుడబ్లు.కడపడీఈఓ.ఇన్‌లో ఉంచినట్లు తెలిపారు. సీనియారిటీ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. తర్వాత వచ్చిన వినతులు స్వీకరించబడవని తెలిపారు.

ఏపీ వాలీబాల్ జట్టు కోచ్‌గా గౌస్‌బాషా



కడప స్పోర్ట్స్: 45వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఏపీ బాలబాలికల జట్టుకు కోచ్‌గా వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాల వాలీబాల్ శిక్షకుడు ఎస్. గౌస్‌బాషాను నియమిస్తూ శాప్ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రిలో నిర్వహించనున్న ఏపీ వాలీబాల్ కోచింగ్ క్యాంపునకు ఈయన ముఖ్య శిక్షకుడుగా వ్యవహరించనున్నారు. అదే విధంగా ఈనెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లోని చాదర్‌నగర్‌లో నిర్వహించే 45వ సబ్‌జూనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో క్రీడాకారులకు శిక్షకుడుగా వ్యవహరిస్తారు.

22న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 19వ తేదీ నిర్వహించాలని తొలుత నిర్ణయించామని, అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈనెల 22వ తేదీకి మార్చినట్లు జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు సమావేశం కడప జెడ్పీ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందన్నారు. కనుక జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరు కావాలని కోరారు.

98 డీఎస్సీ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

వైవీయూ : ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప జిల్లా పరిధిలో 1998 డీఎస్సీ ఎస్‌జీటీగా అర్హత సాధించి కాంట్రాక్ట్ బేసిస్ విధానంలో మినిమం టైంస్కేల్ కింద పనిచేసేందుకు అర్హత కలిగిన ఉపాధ్యాయులకు బుధవారం సర్టిఫికెట్లు వెరిఫికేషన్ నిర్వహించారు. కడప నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ వై. రాఘవరెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 14 నాన్ జాయినింగ్ పోస్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు.

మూడో రోజు ఈఏపీసెట్ ప్రశాంతం

కడప ఎడ్యుకేషన్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ ప్రవేశాల కోసం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా మూడవరోజు బుధవారం ఎంపీసీ విద్యార్థులకు నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్షను జిల్లాలోని 9 పరీక్షా కేంద్రాలలో నిర్వహించారు. రెండు సెషన్స్‌కు సంబంధించి 2968 మందికిగాను 2787 హాజరుకాగా 93.90 హాజరు నమోదయింది.

భానుడి భగ..భగ..



- జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- నర్సరీలకు తప్పని వేసవితాపం
- మండే ఎండలకు విలవిలలాడుతున్న మొక్కలు

రాయచోటి : భగభగ మండుతున్న భానుడు ప్రతాపానికి అన్నమయ్య జిల్లా పరిధిలో జనం అల్లాడిపోతున్నాయి. మూడు రోజులుగా రికార్డు స్థాయిలో ఈ ప్రాంతంలో 41 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతోంది. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇక నర్సరీలకు సైతం వేసవి సెగ తప్పడం లేదు. దీంతో మొక్కలు ఒక్కసారిగా వేడికి తలలు వాలేశాయి. వీటిని సంరక్షించుకోవడం నర్సరీ రైతులు, నిర్వాహకులకు పెను సవాలుగా మారింది. పండ్ల తోటలు, ఆకుకూరలు, కూరగాయల తోటలకు ప్రసిద్ధిగాంచిన నర్సరీలు ఎండ తాపానికి కళాహీనంగా మారుతున్నాయి.



రాయచోటి-మదనపల్లె మార్గంలోని మల్లూరు క్రాస్ రోడ్డు సమీపంలో నర్సరీకి నీరు పడుతున్న దృశ్యం

- చిన్నమండెం, సంబేపల్లి, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, మదనపల్లి మండలాల్లో టమోటా, మిరప, వంగ, పూల మొక్కల నర్సరీలు అధికంగా ఉన్నాయి. అలాగే రైల్వేకోడూరు, రాజంపేట, పుల్లంపేట ప్రాంతాల్లో మామిడి, అరటి, నిమ్మ తదితర మొక్కల నర్సరీలు వందలాదిగా ఉన్నాయి. ఇంటి పెరట్లో పెంచుకునే మొక్కలను వేసవిలో సంరక్షించుకోవడానికి ఆపసోపాలు పడాల్సి వస్తుంది. అలాంటిది ఒక్కొక్క నర్సరీలో లక్షలాది మొక్కలు వివిధ వయస్సులలో ఉంటాయి. వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవడం ఎంత కష్టమో అర్థం చేసుకోవచ్చు.
- సాధారణంగా వేసవిని దృష్టిలో ఉంచుకొని తయారైన మొక్కలను మార్చి నెలకే అమ్మకాలు పూర్తిచేస్తారు. అయితే ఈ ఏడాది అంతంత మాత్రంగానే ఎగుమతులు జరగడం వల్ల మొక్కల నిల్వలు ఎక్కువగా ఉన్నాయని చెప్పుకోవచ్చు. ఇప్పుడు వాటిని బతికించుకోవడం పెను సవాలుగా మారుతోంది.

నీరు ఎక్కువగా పడుతున్నాం..



నర్సరీలలో టమోటా, మిరప, వంగ, మునగ, పూల మొక్కలను పెంచుతున్నాం. మార్చి నెలకు ముందు వరకు ఒకసారి ఉదయం పూట నీళ్ల పట్టే వాళ్లం. ఎండలు అధికం అవుతుండటంతో ఒకసారినీటిని పట్టినా మొక్కలు వాడిపోయి వాలిపోతున్నాయి. నారు మొక్కలను ఎక్కువగా నీటిని పట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాము. – శ్యామల, నర్సరీ మహిళా రైతు, చిన్నమండెం

అప్రమత్తంగా ఉండాలి



జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పులతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటనను జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో 41 నుంచి 43 డిగ్రీల వరకు ఎండలు భగ్గుమనడంతో పాటు వడగాడ్పులు కూడా వీస్తాయని వాతావరణ నిపుణులు తెలిపారన్నారు. ఈ మేరకు భారత మెట్రోలాజికల్ విభాగం(ఐఎండీ), వాతావరణ శాఖ కూడా హెచ్చరికలు జారీ చేయడం జరిగిందన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలతో ఎండలు ఎక్కువ అవ్వడం వల్ల వడగాడ్పుల ముప్పు పొంచి ఉందన్నారు. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. నీళ్లు, మజ్జిగ, కొబ్బరినీరు లాంటివి ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ ఎక్కువసార్లు తీసుకోవడం మంచిదన్నారు. ప్రయాణాలలో ఉన్నవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఇంకిపోతున్నాయి!

- జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- చెరువులు, కుంటలు, బావుల్లో ఇంకిపోతున్న జలం

సాక్షి రాయచోటి: భానుడు భగభగ మండిపోతున్నాడు. రోజురోజుకు వేడి సెగలు ఒకవైపు, ఉష్ణోగ్రతల వేడి మరోవైపు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.వేడిసెగలతో అన్నిచోట్ల పట్టణాలు, పల్లెలు బోసిపోతుండగా, ప్రధాన రహదారులు సైతం చిన్నబోతున్నాయి. ఇంకో వైపు చెరువులు, కుంటల్లో కనిపిస్తున్న నీరు రోజురోజుకు ఇంకిపోతోంది. అలాగే భూగర్భజల మట్టం కూడా పూర్తిస్థాయిలో పడిపోతోంది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

అన్నమయ్య జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.మార్చి ప్రారంభం నుంచి ఏప్రిల్ 15 నాటికి ఒక రకంగా వేడి ప్రభావం ఉన్నా తర్వాత మరింత అధికంగా ఎండవేడిమి పెరిగింది. ఉక్కపోత ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఉదయం నుంచి ఎండలు విపరీత ప్రభావం చూపుతుండడంతో బయటికి రావాలంటే జనం జంకుతున్నారు. రోజువారి ఉష్ణోగ్రతలు సైతం విపరీతంగా పెరిగిపోయాయి. 40–42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రధాన పట్టణాలైన రాయచోటి, మదనపల్లె, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె లాంటి ప్రధాన పట్టణాలు కూడా మధ్యాహ్న సమయంలో జనసంచారం లేక బోసిపోతున్నాయి.

అడుగంటుతున్న భూగర్భ జలాలు: అన్నమయ్య జిల్లాలో వేడి సెగల ధాటికి భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో సైతం నీటి మట్టం తగ్గిపోతోంది. ఓబులవారిపల్లె మండలంలో 17.47 మీటర్లకు భూగర్భ జలమట్టం పడిపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. ఈ జనవరిలో 14.48 మీటర్లలో కనిపించిన జలం ప్రస్తుతం 17.47 మీటర్లకు పడిపోయింది.. జిల్లాలోని కుంటలు, చెరువుల్లో రోజురోజుకు నీటి చెమ్మ తరిగిపోతోంది. జిల్లా కేంద్రమైన రాయచోటిలోని రింగ్‌రోడ్డు చుట్టూ ఉన్న చెరువులు జనవరిలో నీటితో కళకళలాడుతూ కనిపించగా, అదే చెరువులు ప్రస్తుతం నీరు అడుగంటిన పరిస్థితి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. ఎండవేడిమి కారణంగా తాగునీటి బోర్లలో సైతం నీటిమట్టం తగ్గిపోతోంది. మూడు ఇంచులతో నీరు వస్తున్న బోర్లలో సైతం ఒకటిన్నర ఇంచులకు పడిపోయాయి.



రాయచోటి-కడప ప్రధాన రహదారిలోని రింగ్‌రోడ్డు వద్దగల కుంటలో కొద్దిమేర ఉన్న నీరు

భానుడి భగభగలతో నీటి మట్టం తగ్గుదల



జిల్లాలో భానుడు ప్రభావం అధికంగా ఉండడంతో కొంతమేర నీరు ఇంకిపోతున్నాయి. భూగర్భ జలమట్టం కూడా ఈ సీజన్‌లో తగ్గిపోతూ వస్తోంది. తిరిగి వర్షకాల సీజన్ ప్రారంభమైతే నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికీ కూడా రామసముద్రం లాంటి మండలాల్లో నీటి శాతం పైనే ఉంది.
– శివప్రసాద్, జిల్లా భూగర్భజలశాఖ అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

గండికోటలో అధికారుల పర్యటన

జమ్మలమడుగు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటను అభివృద్ధి చేయడం కోసం అహమ్మదాబాద్‌కు చెందిన ఐఎన్‌ఐ డిజైన్ స్టూడియో అనే కంపెనీ ప్రతినిధులు, అధికారులతో కలసి గండికోటలో పర్యటించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్‌రెడ్డి, ఆర్డీఓ జి.శ్రీనివాసులు తదితరులు కన్సల్టెన్సీ ప్రతినిధులైన హర్షగోయాల్ తదితరులతో కలిసి గండికోట టూరిజం స్పాట్‌లను గుర్తించడం కోసం పర్యటించారు.

ఈ సందర్భంగా టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్వదేశీ దర్శన్ పేరుతో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడం కోసం కన్సల్టెన్సీల ప్రతినిధులను టెండర్‌లకు ఆహ్వానిస్తోందన్నారు. మన రాష్ట్రంలో గండికోట, లంబసింగి అరకు ప్రాంతాలు స్వదేశీదర్శన్ కింద ఎంపికైనట్లు తెలిపారు. గండికోటను పర్యాటకంగా తీర్చిదిద్దడం కోసం గుజరాత్ రాష్ట్రం అహమ్మదాబాద్‌కు చెందిన టూరిజం కన్సల్టెన్సీ ఐఎన్‌ఐ డిజైన్ స్టూడియో కంపెనీకి అప్పగించడం జరిగిందన్నారు. గండికోట టూరిజం డెవలప్‌మెంట్ చేయడం కోసం ఆ సంస్థ ప్రతినిధులు గండికోటలో పర్యటించారన్నారు. ఈసందర్భంగా వారు కోట లోపల, గండికోట పెన్నాలోయ తదితర ప్రాంతాలలో ఎటువంటి అభివృద్ధి చేపట్టాలని, రిసార్టులను ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయాలపై స్థలాలను పరిశీలించారన్నారు. మొత్తం ప్రాజెక్టుకు సంబంధించిన రిపోర్టులను తయారు చేసి జూన్ 26వ తేదీన తిరిగి గండికోట డెవలప్‌మెంట్‌పై డాక్యుమెంటరీ తయారు చేసి కడపలో ప్రదర్శన చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ విజయ రామరాజు చూసిన తర్వాత ఏమైనా మార్పులు చేర్పులను చేసి జూలై 7వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ప్రజెంటేషన్ ఇస్తామన్నారు. స్వదేశీ దర్శన్ కింద గండికోటను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడం కోసం పక్కా ప్రణాళికలతో ముందుకు వెళుతోందన్నారు. గండికోటలో థీంపార్కు, మ్యూజియం పార్కు, అడ్వెంచర్స్ అకాడమి వంటివి ఏర్పాటు చేయడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.



గండికోటలో పర్యటించిన అహమ్మదాబాద్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, అధికారులు

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి: జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. అన్నమయ్య జిల్లా, రాజంపేట, నారంరాజుపల్లి (ఆకేపాడు)లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుండి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు. దరఖాస్తు ఫారం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 31వ తేదీలోగా గడువు నిర్ణయించామన్నారు. పూర్తి వివరాలకు www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. అలాగే జూలై 22వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలోని పదోతరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

గిరిజన గురుకుల పాఠశాలల్లో..

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లాలోని ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తరగతిలో చేరేందుకు, 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న వాటికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. 3వ తరగతిలో చేరేందుకు ఎస్టీ–30, ఎస్సీ–5, బీసీ–2, ఏసీ–1, ఏఈక్యూ–1 పీటీజీ/పీహెచ్‌సీలకు –1 ప్రకారం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అలాగే 4వ తరగతిలో ఎస్టీ–33, 5వ తరగతిలో ఎస్టీలకు –32, 6వ తరగతిలో ఎస్టీలకు –16, 7వ తరగతిలో ఎస్టీలకు –18, 8వ తరగతిలో ఎస్టీలకు –06, 9వ తరగతిలో ఎస్టీలకు – 5 సీట్లు మాత్రమే ఖాళీ ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలియచేశారు. మరింత సమాచారం కోసం 95023 91204, 88972 09738 లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చున్నారు. దరఖాస్తులు అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని రాయచోటి – రాజంపేట రోడ్డులోని జిల్లా కార్యాలయాల సముదాయాల వద్ద నేరుగా తమ పాఠశాలలో సమర్పించాలని చెప్పారు.





విరగ్గాసిన ఈత

వేసవికాలంలో ఈత చెట్లకు కాయలు కాస్తాయి. మదనపల్లె మండలం పోతబోలు వద్ద ఓ ఈతచెట్టు విరగ్గాసింది. ఆ దారిన వెళ్లే వారంతా ఈ చెట్టును ఆసక్తిగా తిలకిస్తున్నారు. చాలా మంది ఈ కాయలను ఇష్టంగా తింటారు. మంచి పోషకాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.
–మదనపల్లె సిటీ

19 నుంచి అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి

రాయచోటి అర్బన్ : ఈనెల 19 నుండి 22వ తేది వరకు అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని అన్నమయ్య జిల్లా ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు 14, సహాయకులు 58, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు 13 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులకు నిర్ణయించిన తేదీలలో రెవెన్యూ డివిజన్ల వారీగా రాత, మౌఖిక పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు.

- మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఖాళీ అంగన్‌వాడీ పోస్టులకు ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.
- రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని పోస్టులకు ఈనెల 19వ తేదీన రాజంపేట ఆర్‌డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.
- రాయచోటి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు రాయచోటి ఆర్‌డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూల నిర్వహణ ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న, అర్హతగల అభ్యర్థులంతా తమ ప్రాజెక్టుల పరిధిలోని రెవెన్యూ డివిజన్‌కు నిర్ణయించిన తేదీలలో సూచించిన సమయానికి తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పరీక్షలకు హాజరుకావాలన్నారు.

వీఐపీ, వీవీఐపీలకు భద్రత ఇవ్వాలి

ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి: ఎటువంటి విపత్కర పరిస్థితినైనా అంచనా వేసి ఎదుర్కొనేందుకు అంగరక్షకులు సిద్ధమై వీఐపీలు, వీవీఐపీలు, ఉన్నతాధికారులకు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు పిలుపునిచ్చారు. బుధవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం గ్రౌండ్‌లో పోలీస్ అంగరక్షకుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ అంగరక్షకులను ఉద్దేశించి మాట్లాడుతూ నిపుణులతో మెరుగైన శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. విధి నిర్వహణలో నైపుణ్యం చూపుతూ, వీఐపీ, వీవీఐపీలకు కంటికి రెప్పలా భద్రత అందించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎక్కడ కూడా రాజీ పడకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. డ్యూటీలో ఆయుధాలను పరిశుభ్రంగా, జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. మీ వీఐపీ, వీవీఐపీలను ఎవరెవరు కలుస్తున్నారు, వారు ఎలాంటి వారు, తనిఖీ చేసిన అనంతరం వారిదగ్గరకు పంపాలని ఎస్పీ తెలిపారు. జిల్లాలో భద్రతగా ఉన్న పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లకు రాయచోటి జిల్లా పోలీసు పేరెడ్ మైదానంలో చివరి విడత శిక్షణ ముగిసిందని ఏఆర్ డీఎస్పీ పి మహబూబ్ బాష తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంగరక్షకుల ఇన్‌స్పెక్టర్ ఎస్ జావిద్, అంగరక్షకులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎస్పీ గంగాధర రావు

రూ. 2 లక్షలు ఆర్థిక సాయం

గుండెపోటుతో మరణించిన పోలీసు రహీంబాబు కుటుంబానికి రూ. 2 లక్షలు ఆర్థిక సాయాన్ని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు అందజేశారు. నందలూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో రహీంబాబు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా బుధవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మృతుని కుటుంబీకులకు ఎస్పీ చెక్కును అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆర్టీపీపీ సీఈగా నాగరాజు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) చీఫ్ ఇంజనీర్‌గా నాగరాజును నియమించారు. ఏపీజెన్‌కో యాజమాన్యం నెల్లూరులో పని చేస్తున్న ఆయనను ఎర్రగుంట్లకు మార్చింది.

క్లుప్తంగా

గూడ్స్ వ్యాగిన్లలో చెలరేగిన మంటలు

నందలూరు (రాజంపేట) : నందలూరు రైల్వే స్టేషన్‌లో బుధవారం ఆగిఉన్న గూడ్స్‌రైలు వ్యాగిన్లలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కృష్ణపట్నం నుంచి ఆర్టీపీపీకి బొగ్గు లోడుతో వెలుతున్న గూడ్స్‌రైలు నందలూరు రైల్వేస్టేషన్‌లో నిలచిఉండగా ఈ సంఘటన జరిగింది. గమనించిన స్టేషన్ మాస్టారు అగ్నిమాపకశాఖ ,సిబ్బందికి సమాచారం అందించారు. నందలూరు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కలసి మంటలను ఆర్పివేశారు. పెను ప్రమాదం తప్పడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

తాయత్తులు కట్టి రూ.10లక్షలకు టోకరా

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ వడ్డిపల్లిలో ఉంటున్న కనకమ్మ అనే మహిళ కావమ్మ దేవత పడుతుందని ఆశ చూపి తాయత్తులు కట్టి 10 లక్షలు వరకు బంగారు, నగదు తీసుకొని మోసం చేసిందని బుధవారం జాకీర్ పోలీసులకు పిర్యాదు చేసాడు. డబ్బుల డిగితే ఆమె భర్త శివయ్య, కుమారులు శ్రీను, సుబ్రమణ్యంలు చంపేస్తామని బెదిరిస్తున్నట్లు తెలిపారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మోహన్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

పెన్నమ్మ తీరాన కన్నీటి ధారలు



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



సురక్షితంగా బయటపడిన పిల్లలు. వారిని కాపాడిన వెంకటరత్నం

- నీటిలో మునిగి ఇంజినీరు మృతి
- సురక్షితంగా బయటపడిన ఇద్దరు పిల్లలు

వల్లూరు : పుణ్య క్షేత్రమైన పుష్పగిరి వద్ద పెన్నా నది నీటిలో మునిగి ఏనుగు బసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి (38) అనే ఇంజినీర్ బుధవారం మృతి చెందాడు. వల్లూరు పోలీసుల కథనం మేరకు వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లకు చెందిన శ్రీకాంత్ రెడ్డి హిందూస్థాన్ లీవర్ కంపెనీలో ఇంజినీర్‌గా పని చేస్తూ ప్రస్తుతం రాజమండ్రిలో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో కుటుంబంతో కలిసి ఎర్రగుంట్లకు వచ్చారు. బుధవారం ఉదయం తన భార్య శ్రావణి, ఇద్దరు కుమార్తెలు, అక్క కృష్ణ వేణి, వారి పిల్లలు కౌసిక్ రెడ్డి (11), తనిష్కరెడ్డి (14), చెల్లెలు సునీతలతో కలిసి దైవ దర్శనం కోసం పుష్పగిరికి వచ్చారు. అందరూ కలిసి పెన్నా నదిలో స్నానాలకు దిగారు. శ్రీకాంత్ రెడ్డి తన మేనళ్లులైన కౌసిక్ రెడ్డి, తనిష్కరెడ్డిలతో కలిసి లోతు ఎక్కువగా ఉన్న ప్రదేశంలోకి వెళ్లారు. ఈ క్రమంలో శ్రీకాంత్ రెడ్డి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. కొద్ది సేపటికి ఊపిరాడక మృతి చెందాడు.

ఇద్దరు పిల్లలను కాపాడిన రత్నం

కాగా శ్రీకాంత్ రెడ్డితో బాటు నదిలో అతనికి అతి సమీపంలో ఈత ఆడుతున్న కౌసిక్ రెడ్డి, తనిష్కరెడ్డిలు సైతం నీట మునిగి ప్రమాదంలో చిక్కుకున్నారు. అదే సమయానికి పుష్పగిరి కొండపైన విధి నిర్వహణలో ఉన్న పురావస్తు శాఖకు చెందిన వెంకట రత్నం గమనించి పరుగున వచ్చి నదిలోకి దూకారు. సాహసంతో పిల్లల వద్దకు చేరుకుని ఇద్దరినీ ఒకే సారి తన వీపున వేసుకుని అతి కష్టం మీద వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. తిరిగి నదిలోకి వెళ్లి శ్రీకాంత్ రెడ్డి కోసం వెదికారు. అప్పటికే నీరు తాగి ఊపిరాడక మృతి చెందిన అతని మృతదేహాన్ని వెంకట రత్నం బయటకు తీసుకొచ్చారు. ప్రాణాలకు తెగించి ఇద్దరు పిల్లలను కాపాడిన వెంకట రత్నంను పలువురు ప్రశంసించారు. కాగా వెంకట రత్నం సురక్షితంగా బయటకు తీసిన పిల్లలు కౌసిక్ రెడ్డి, తనిష్కరెడ్డిలు అన్నమయ్య జిల్లా పీలేరు సీఐ మోహన్‌రెడ్డి తనయులుగా తెలిసింది. తల్లి కృష్ణవేణితో కలిసి మేనమామ శ్రీకాంత్ రెడ్డి వద్దకు వచ్చిన వారు నదిలో స్నానం చేస్తూ ప్రమాదంలో చిక్కుకున్నారు.

మిన్నంటిన ఆక్రందనలు

దైవ దర్శనానికి వచ్చి తమ కళ్లెదుటే శ్రీకాంత్‌రెడ్డి మృతి చెందడంతో అతని భార్య, అక్క, చెల్లెళ్ల ఆక్రందనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పెద్ద ఓబన్న సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించి పోస్ట్ మార్టం అనతరం బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు



సుబ్రహ్మణ్యం (ఫైల్)



శ్రీనివాసులు (ఫైల్)

మదనపల్లె : చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.వారి నుంచి బంగారు నగలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. బాధితుని వెంట ఉన్న స్నేహితులే చోరీకి పాల్పడినట్లు వెల్లడించారు. బుధవారం స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మదనపల్లె మండలం వేంపల్లె గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి, మదనపల్లె మండలంలోని చీకిలబైలు పంచాయతీ కోళ్లవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం ముగ్గురు స్నేహితులు. వారు ముగ్గురు కలిసి కోళ్లవారిపల్లె సమీపంలోని కొంత భూమిని లీజుకు తీసుకుని టమాటా పంట సాగు చేశారు. ప్రసాద్‌రెడ్డికి ఇటీవల టమాటా పంటలో రూ.5 లక్షలు డబ్బు చేతికిరాగా ఇంటిలోని బీరువాలో ఉంచాడు. కాగా స్నేహితుడైన సుబ్రహ్మణ్యం ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేశారు. అందుకు కొంతడబ్బు అవసరం కావడంతో మరో స్నేహితుడు శ్రీనివాసులును రూ.50 వేలు అప్పు ఇవ్వాలని కోరారు. అయితే శ్రీనివాసులు తన వద్ద డబ్బు లేదని, ప్రసాద్ రెడ్డి వద్ద ఉందని, ఇంటిలోని బీరువాలో ఉంచాడని తనకు తెలిసిన సమాచారాన్ని స్నేహితుడు సుబ్రహ్మణ్యంకు చెప్పాడు. దీంతో ఇద్దరూ కలిసి ఆ నగదు కాజేయాలని పథకం వేశారు. అందులో భాగంగా ఈనెల 12వ తేదీ రాత్రి శ్రీనివాసులు మద్యం తాగేందుకు ప్రసాద్‌రెడ్డిని తీసుకుని బయటకు వెళ్లాడు. పథకంలో భాగంగా మరో స్నేహితుడు సుబ్రహ్మణ్యం నేరుగా ప్రసాద్‌రెడ్డి తాళం పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించాడు. బీరువా తలుపులు, లాకర్లు ధ్వంసం చేసి రూ.4.40 లక్షల నగదు, 40 గ్రాముల బంగారు నగలు చోరీ చేశాడు. అందులో నుంచి రూ.2.50 లక్షలు తీసుకుని మిగిలిన డబ్బు, బంగారు నగలు తీసుకెళ్లి పొలం వద్ద దాచాడు. అదేరోజు స్నేహితుడు ప్రసాద్‌రెడ్డితో కలిసి చోరీ విషయమై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ముగ్గురూ వచ్చారు. ఫిర్యాదు అందుకున్న తాలూకా సీఐ సత్యనారాయణ మరుసటి రోజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.స్థానికులను విచారించారు. వారిలో కొందరు సుబ్రహ్మణ్యంపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో వెంటనే వేలిముద్రల నిపుణులను రప్పించి వేలిముద్రలను సేకరించారు. సుబ్రహ్మణ్యం వేలిముద్రలను సైతం తీసుకున్నారు. అనంతరం దర్యాప్తులో బీరువాపై ఉన్న వేలిముద్రలు, సుబ్రహ్మణ్యం వేలిముద్రలు సరిపోలడంతో సుబ్రహ్మణ్యంను నిందితుడుగా గుర్తించారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. చోరీలో కీలకంగా వ్యవహరించిన శ్రీనివాసులును సైతం అరెస్ట్ చేయడంతో పూర్తిస్థాయిలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో నిందితుల గుట్టు రట్టయ్యింది. దీంతో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరి దుర్మరణం





మృతిచెందిన రెడ్డిశేఖర్, నరేష్

రొంపిచెర్ల(చిత్తూరు జిల్లా) : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన పెద్దగొట్టిగల్లు పంచాయతీలోని బుధవారం రాత్రి జరిగింది. మృతి చెందిన ఇద్దరూ అన్నమయ్య జిల్లాకు చెందిన వారు. కలకడ మండలం గాలివేటువారిపల్లెకు చెందిన కె.రెడ్డి శేఖర్(33) తిరుపతి నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అదే సమయంలో కలికిరి మండలానికి చెందిన నరేష్(43) పీలేరు నుంచి వస్తున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో ఇద్దరూ బోనంవారిపల్లె బస్సు షెల్టర్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. రొంపిచెర్ల ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం తరలిస్తూ పట్టుబడిన యువకుడు



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

బి.కొత్తకోట: డ్రైవర్‌గా పనిచేస్తే చాలినంత ఆదాయం రావడంలేదు, ఎలాగైనా డబ్బు సంపాదించాలన్న లక్ష్యంతో అక్రమ మద్యాన్ని కర్ణాటక నుంచి తరలిస్తున్న యువకుడు పోలీసలకు పట్టుబడ్డాడు. ఎస్‌ఐ కే.రామమోహన్ కథనం మేరకు వివరాలు..పెద్దతిప్పసముద్రం మండలం కాయలవారిపల్లెకు చెందిన ఎ.నాగరాజు (28) వృత్తిరీత్యా డ్రైవర్. ఇతను ఫార్చ్యునర్ కారును అద్దెకు నడుపుతూ జీవిస్తున్నాడు. డ్రైవర్‌గా రోజూ పనిలేకపోవడం, చాలినంత ఆదాయం లేనందున కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమం కొనుగోలుచేసి పీటీఎం మండలానికి తరలించి విక్రయించుకుంటున్నాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ రామమోహన్ సిబ్బందితో నాయనబావి వద్ద నిఘా వేశారు. నాగరాజు కర్ణాటకలోని రాయల్పాడుతో 288 ప్యాకెట్ల మద్యాన్ని బాక్సుల్లో వేసుకుని మొటుకుపల్లె నుంచి నాయనబావికి వస్తుండగా పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. తప్పించుకునేందుకు ప్రయత్నించినా వీలుకాలేదు. కారులో తనిఖీలు చేయగా కర్ణాటక మద్యం గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కారును సీజ్ చేసి నిందితుడు నాగరాజును అరెస్ట్‌చేసి మంగళవారం కోర్టుకు తరలించామని ఎస్‌ఐ చెప్పారు. కాగా నిందితుడు నాగరాజుపై కర్ణాటకలోని ఆర్‌టీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైనట్టు తెలిపారు.దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

మిత్రున్ని ఫ్లైట్ ఎక్కించడానికి వెళుతూ..



ప్రమాదంలో ధ్వంసమైన కారు



మృతిచెందిన నిజాముద్దీన్



చేయి విరిగిన కారు డ్రైవర్ ఫిర్దోస్



గాయపడిన ఐషర్ డ్రైవర్ అభిలాష్



గాయపడిన ఇనాయతుల్లా

బి.కొత్తకోట : ఉపాధి కోసం కువైట్‌కు వెళ్తున్న మిత్రున్ని చెన్నై విమానాశ్రయం వద్ద వదిలేందుకు కారులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మినీఐషర్ వాహనం ఢీకొనడంతో ఒకరు దుర్మరణం చెందారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున 2 గంటలకు బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ ఎర్రమద్దువారిపల్లె సమీపంలో జరిగింది. ఎస్‌ఐ కే.రామమోహన్ కథనం మేరకు వివరాలు.. శ్రీసత్యసాయి పుట్టపర్తిజిల్లా కదిరికి చెందిన ఇనాయతుల్లా (42) ఉపాధి కోసం కువైట్‌కు వెళ్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున చెన్నై విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సి ఉంది. దీంతో ఇనాయతుల్లాకు తోడుగా కదిరి పట్టణానికి చెందిన మిత్రులు నిజాముద్దీన్ (50), ఇమ్రాన్‌ఖాన్ (40), మహబూబ్‌బాషా (40), అబిద్ (30), కారు డ్రైవర్ ఫిర్దోస్ (35)లు అర్ధరాత్రి కారులో చెన్నైకి బయలుదేరారు. కారు బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీలో ఎర్రమద్దువారిపల్లె సమీపంలో వస్తుండగా.. గుంటూరుజిల్లా చిట్యాడ నుంచి పచ్చిమిర్చితో కదిరికి మినీ ఐషర్ వాహనం వేగంగా వస్తోంది. వేగాన్ని అదుపు చేయలేకపోవటంతో కారును దూసుకెళ్లి ఢీ కొంది. కారులో ప్రయాణిస్తున్న నిజాముద్దీన్ తీవ్రగాయాలతో దుర్మరణం చెందాడు. డ్రైవర్ ఫిర్దోస్‌కు కుడిచేయి, మహబూబ్‌బాషాకు మణికట్టు విరిగాయి. ఇనాయతుల్లా, ఇమ్రాన్‌ఖాన్, అబిద్‌లకు గాయాలయ్యాయి. మినీఐషర్ వాహనం డ్రైవర్ అభిలాష్ (30) కూడా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వారిని తిరుపతి తరలించారు. కాగా మిత్రున్ని కువైట్‌కు పంపేందుకు బయలుదేరి మార్గమధ్యలో ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇనాయతుల్లా కువైట్ ప్రయాణం ఆగిపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

కలికిరి : బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వివరాలు.. మండలంలోని మునెళ్ళపల్లి గ్రామం రామాపురానికి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న మైనర్ బాలిక సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లింది.చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తండ్రి మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

భార్యాభర్తలపై దాడి

కలికిరి : భార్య, భర్తపై దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మధుసూదనాచారి తెలిపారు. వివరాలు.. కలికిరి గ్రామ పంచాయతీ తుమ్మలపేటకు చెందిన ఎస్.వెంకటరమణ,అతని భార్య పద్మావతి మంగళవారం రాత్రి ఇంటి ముందు నిద్రిస్తుండగా పక్క ఇంటికి చెందిన సుధాకర, మునినాథయ్య, మహేష్ లు మిద్దెపై నుండి వీరిపై ఎంగిలి ఉమ్మారు. ఇదేమిటని ప్రశ్నించడంతో దాడి చేశారు. గ్రామస్తులు అడ్డుకుని సర్దిచెప్పారు. ఈ మేరకు బుధవారం బాధితుడు వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆర్మీజవాన్ ఆత్మహత్య



దేవేంద్రకుమార్ (ఫైల్)

పీలేరురూరల్ : ఆర్థిక ఇబ్బందులతో ఆర్మీజవాన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కావలిపల్లె పంచాయతీ ముల్లగూరవాండ్లపల్లెలో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరాళ్ల గ్రామం సోమలోళ్లపల్లెకు చెందిన సోమల పెద్ద వెంకటరామయ్య కుమారుడు సోమల దేవేంద్రకుమార్ (25) ఏడు సంవత్సరాలుగా శ్రీనగర్‌లో ఆర్మీ జవాన్‌గా పని చేస్తున్నాడు. మూడేళ్ల క్రితం మండలంలోని ముల్లగూరవాండ్లపల్లెకు చెందిన రామనారాయణ కుమార్తె వాణితో వివాహం జరిగింది. ప్రస్తుతం వాణి ఎనిమిది నెలల గర్భిణీ. దేవేంద్రకుమార్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండేవాడు. రెండు వారాల క్రితం సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. అక్కడి నుంచి గత వారం అత్తగారిళ్లు ముల్లగూరవాండ్లపల్లెకు వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ నరసింహుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బొలెరో వాహనం ఢీ: యువకుడి మృతి

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో నల్లవాడు వంక సమీపంలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు బొలెరో వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ రాజగోపాల్ కథనం మేరకు తొండూరు గ్రామానికి చెందిన ప్రసాద్ బొలెరో వాహనం వెల్లాల గ్రామ సమీపంలో ఓ సంస్థ వద్ద బాడుగకు తిప్పుతున్నాడు. పని అయిపోవడంతో తొండూరుకు వెళుతుండగా కొర్రపాడులోని నల్లవాగు వంకకు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. అందులో ఉన్న కొర్రపాడు గ్రామానికి చెందిన బాబుద్దీన్, ఇస్మాయిల్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాబుద్దీన్ (22) మృతిచెందాడు. బాబుద్దీన్, ఇస్మాయిల్ ప్రొద్దుటూరులోని మార్టులో పనిముగించుకొని ఇంటికి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. అలాగే ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం వద్ద ప్రసాద్ వాహనాన్ని ఓ ఇంటికి తగిలించాడు. ఈ విషయంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించాడు.

ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

ఏఎఫ్‌యూ : కడపలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, అర్బన్ రీజినల్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో స్క్రీన్ ద్వారా ప్రథమ సెమిస్టర్, తృతీయ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైస్ ఛాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రథమ సెమిస్టర్ కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్‌లో 96 శాతం, మూడోసెమిస్టర్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ 76 శాతం, మూడోసెమిస్టర్ అర్బర్ రీజినల్ ప్లానింగ్ 80 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 5వ సెమిస్టర్ కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్‌లో 80 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అదనపు అధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, ఉదయ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా



బాలాజీ మృతదేహం



చికిత్స పొందుతున్న నవీన్

మదనపల్లె : ఈత సరదా విద్యార్థి ప్రాణం తీసింది. బుధవారం ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థి విషమ పరిస్థితుల్లో ఉన్న సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. ఈ ఘటన రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. మండలంలోని దుబ్బిగానిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన సురేంద్ర, కుమారి దంపతుల కుమారుడు బాలాజీ (14) శ్రీనివాసులు, రమాదేవి దంపతుల కుమారుడు నవీన్ (14) స్నేహితులు. వీరు మదనపల్లె సమీపంలోని చేనేతనగర్‌లో ఉన్న బీసీ సాంఘీక సంక్షేమ వసతి గృహంలో ఉంటూఎనిమిదో తరగతి పూర్తి చేశారు. వేసవి సెలవులకు స్వగ్రామానికి తిరిగి వచ్చారు. కాగా బుధవారం పశువులు మేపేందుకు రెడ్డివారిపల్లెచెరువు సమీపంలోకివెళ్లారు. అక్కడ పశువులను మేతకు వదిలి ఈత ఆడేందుకు చెరువులోకి దిగారు. ఈ క్రమంలో ఈత ఆడుతూ ప్రమాదవశాత్తు నీటమునిగిపోయారు. గమనించిన స్థానికులు చెరువులోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. అరగంట తర్వాత విద్యార్థులను బయటకు తీశారు. హుటాహుటిన ఇద్దరిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి బాలాజీ మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. నవీన్‌కు వైద్య చికిత్స అందించారు. అయితే బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ ఘటనతో గొల్లపల్లెలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ చెప్పారు.

బస్సుపై నిద్రిస్తుండగా కిందపడి..



వి. మల్లికార్జున (ఫైల్)

కడప అర్బన్ : కడపలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అద్దె బస్సు డ్రైవర్ వి. మల్లికార్జున(55) ప్రమాదవశాత్తు బస్సు పై నుంచి క్రింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దవటం మండలం గొల్లపల్లెకు చెందిన వి. మల్లికార్జున కడప డిపో అద్దె బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ కడప నుంచి తిరుపతికి విధులకు వెళ్లేవాడు. విధులను ముగించుకున్న తరువాత రాత్రి వేళల్లో బస్సును బస్టాండ్ ఆవరణలో పార్కింగ్ చేసి బస్సు టాప్‌పై పడుకునేవాడు. తెల్లవారు జామున లేచి యథావిధిగా విధులకు వెళ్తుంటాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి విధులు ముగించుకుని రోజు మాదిరిగానే బస్సు టాప్‌పై పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో ప్రక్కకు ఒరిగిన సమయంలో ప్రమాదవశాత్తు క్రిందకు బోర్లా పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని ముఖానికి తీవ్రగాయాలై రక్తస్రావం ఎక్కువ కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతను క్రిందపడిన సమయంలో ఎవరూ గమనించ లేదు.. బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో సహచర డ్రైవర్లు గమనించి విషయాన్ని ఆర్టీసీ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కడప వన్‌టౌన్ ఎస్‌ఐ రంగస్వామి సంఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.